# హనీమూన్

**"కొత్తదంపతుల** పర్యటన్ని ఏ మంటారు?" భర్త షర్టు గుండీలు సవరిస్తూ కుతూహలంగా అడిగింది హనుమాయమ్మ. "హనీమూన్ అంటార్లే" ఉన్నట్లుండి ఆ ఆలోచన నకెందుకొచ్చింది? హఠాత్తుగా భార్య అడిగిందానికి విస్తుపోయాడు పరమానందం.

"అం అది...హనీమూన్ రాత్రినుండి బుర్ర కొట్టుకుంటున్నాను. గుర్తొచ్చి చావడం లేదు. ఏవండి! మనం కూడా హనీమూన్‌కి వెళదామండి" మురిపెంగా అంది హనుమాయమ్మ.

"ఎవరైనా వింటే నవ్విపోతారు. ఈ వయసులో మనం వెళ్ళవలసింది హనీమూన్‌కి కాదు కాశీయాత్రకి"

పరమానందం మాటలలో అవహేళన ధ్వనిస్తోంది. బిక్కచచ్చిపోయింది హనుమాయమ్మ. పాపం పెళ్లైనప్పటి నుండి ఆమెకు ఏ ముచ్చటైనా తీరితేనా? మెట్టినింట్లో కాలు మోపిందగ్గర నుంచి అత్తమామల ఆడబడుచుల సేవలతోనే సరిపోయింది. సిగలో మల్లెలు ముడుచుకుని మొగుడితో ముచ్చటగా ఏనాడు ఓ సినిమా కెళ్ళిన పాపాన పోలేదు. పెద్దలు కాలం చేసారు. రెక్కలొచ్చిన పిల్లలు ఎవరిదారి వారు వెతుక్కున్నారు. ఇప్పుడామెకంతా విశ్రాంతే. అందుకే ఆమె ఆలోచనలు మళ్ళీ మొదటికొచ్చాయి.

ఆమె స్థితి అర్థమైంది పరమానందానికి. అర్థాంగి మనసు నొప్పించడమిష్టం లేక "సరే, సాయంత్రం ట్రైనుకు బయలుదేరుదాం" అన్నాడు.

ఆ మాటలకు కలువ పువ్వుల్లా విప్పారాయి ఆమె కళ్ళు.

"రైల్లో కాదండి. మధ్య మధ్య మజిలీలు చేస్తూ ఎంచాక్క ఏ స్కూటర్ మీదో....."

"నీ కిప్పుడు విహారయాత్ర మీదకు మనసు మళ్ళిందని ఉన్నపళంగా నేనెక్కడ నుంచి పట్టుకొచ్చేది మోటారు సైకిలు.

"మీ మిత్రుడు మన్మధరావునని అడిగి చూడరాదూ" సలహా పారేసింది హనుమాయమ్మ.

భార్య మాట కొట్టిపారేయలేక అయిష్టంగానే బండికోసం బయలు దేరాడు పరమానందం.

సినిమాల్లో ప్రేమికుల షికార్లు గుర్తొచ్చి చిన్నగా నవ్వుకుంది హనుమాయమ్మ. ఇక ఈ జన్మలో తీరదనుకున్న కోరిక అంత త్వరగా తీరబోతున్నందుకు ఉల్లాసంతో ఎగిరి గంతులేసిందామె మనసు.

ఊహల్లోంచి ఊడిపడక ముందే కూతురు పిల్లలు గుమ్మంలో సిద్ధం. హనుమాయమ్మ ఉత్సాహమంతా నీరు కారిపోయింది. చేసేదేమీ లేక వచ్చిన వాళ్ళను పలకరించి లోపలకు తీసికెళ్లింది.

"హనూ! బండి తీసుకొచ్చాను"

"ఉష్. గట్టిగా మాట్లాడకండి. అమ్మాయి పిల్లలు వచ్చారు. మన హనీమూన్ వైనం వాళ్ళు పసిగట్టారో ఎద్దేవా చేయగలరు" అంది హనుమాయమ్మ.

మూతి మీద చేయి వేసుకున్నాడు పరమానందం.

"భలే భలే, హీరోహోండా" బండిమీదెక్కి స్వారీ చేయడం ప్రారంభించారు హరి, గిరి.

"తెచ్చారుగా బండి. తిప్పి తీసుకురండి వాళ్ళని" అన్నది హనుమాయమ్మ.

సరేనని వాళ్లని బండెక్కించుకుని వీధిన పడ్డాడు పరమానందం.

కూతురు తిరుగు ప్రయాణానికి పెట్టి సర్దుకున్న మరుక్షణం వీధి తలుపుకు తాళం కప్ప బిగించింది హనుమాయమ్మ.

"నడుం మీద చెయ్యి తీయి" హీరో హోండా స్టార్టు చేస్తూ అన్నాడు పరమానందం.

"మీకు తెలుసునో తెలియదో మోటారు సైకిలు ఎక్కినప్పుడు భార్యభర్త నడుము చుట్టూ చెయ్యివేయాలి" అంది హనుమాయమ్మ అదేదో చిత్రంలోని దృశ్యాన్ని తలచుకుంటూ.

"ఇ...హి...హి...హి...నీ ముచ్చట మండినట్లే ఉంది. నాకు గిలిగింతలెక్కువ. చెయ్యి తీయకపోయావో కట్టెతో కైలాసం చేరుకోవడం ఖాయం."

అయిష్టంగా చెయ్యి తీసుకుంది హనుమాయమ్మ గేర్ మార్చాడు పరమానందం. స్పీడందుకుంది మోటారు సైకిలు. తేలిపోతున్నట్లు ఉంది హనుమాయమ్మ మనసు.

రెండు వీధి కుక్కలు రోడ్డు మధ్యకొచ్చి పోట్లాడుకుంటూ వుంటే బండి స్లో చేసాడు పరమానందం.

వాటిలో ఒక కుక్క బౌ బౌ మంటూ మోటారు సైకిల్ని వెంబడించడం మొదలు పెట్టింది.

పరమానందం గుండె దడదడలాడింది.

"ఏవండి కుక్క...." గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని అంది హనుమాయమ్మ.

"భయపడకు బండి స్పీడెక్కిస్తాను. కళ్ళు మూసుకుని హనుమాన్ చాలీసా పఠించుకో"

"మీరు గాని ఆ పని చేసారు"

భార్య మాటలకు పగలబడి నవ్వాడు పరమానందం.

బౌ...బౌ...బౌ

కుక్క అరుపులకు బ్యాలన్సు తప్పుతోంది పరమానందం బండి.

గభాలున బ్రేకేసాడు.

"అమ్మో!...." తుళ్లి క్రింద పడింది హనుమాయమ్మ.

"దెబ్బ ఏమైనా తగిలిందా" అర్ధాంగిని లేవదీస్తూ అడిగాడు పరమానందం.

"కుక్క కరిచిందండి"

"ఆ మాట చెప్పవేం?" అంటూ చెప్పుతీసి రక్తం కారుతున్న కాలివమీద టపీటపీమని రెండు దెబ్బలేసాడు పరమానందం.

"కుక్క వాతపడి నేను ఛస్తుంటే మీరేంటి మరింత కొడుతున్నారు." రొప్పుతూ అంది హనుమాయమ్మ.

"కుక్క కాటుకు చెప్పుదెబ్బ అన్నారు. నీకు తెలీదా?"

'మీ సామెత సంతకెళ్ళా. నన్ను బలవంతంగా చంపేసేట్లున్నారు. అమ్మో నొప్పి.... బాబోయ్ నొప్పి" రాగం అందుకుంది హనుమాయమ్మ.

ఆమె బాధను చూడలేక రిక్షా ఎక్కించి హాస్పటల్‌కు చేర్చాడు పరమానందం.

"వారం రోజులపాటు మీరు కుక్కను జాగ్రత్తగా గమనించాలి. అదిగాని చచ్చిపోతే పిచ్చికుక్కే. అందులో సందేహం లేదు. ముందా విషయం నిర్ధారణ చేసుకురండి"

డాక్టరు మాటలకు తెల్లమొహం పెట్టింది హనుమాయమ్మ.

"ఇప్పుడు నేను కుక్క వెంట పడలేను గాని కరిచింది పిచ్చి కుక్కే అనుకుని వైద్యం ప్రారంభించండి. ఎలానూ మేం డబ్బు పట్టుకుని హనీమూన్‌కని బయల్దేరాం. ఆ డబ్బుతో వారం రోజులు ఇక్కడే...."

"ఏమిటి హనీమూన్‌కా!" పదహారు పళ్లు బయటపెట్టాడు డాక్టర్ పరమేశం.

పెనిమిటి చేయి గిల్లింది హనుమాయమ్మ. నోరు కరచుకున్నాడు పరమానందం.

అతడి తత్తపాటును చూస్తున్న పరమేశానికి నవ్వాగలేదు. వెంటనే లేచి కట్టు కట్టి ఇంజక్షన్ చేసాడు.

'నాకిప్పుడు బాగానే ఉంది. పిచ్చి కుక్క కరిచిందేమోనన్న అనుమానం తొలగించుకుని బయలు దేరండి" మగడి చేయి పుచ్చుకుని బయటకు లాగింది హనుమాయమ్మ.

ఇరువురూ హీరో హోండా అధిరోహించారు. మోటారు సైకిల్ కొంత దూరం వెళ్ళి బర్ర్ర్ మంటూ ఆగిపోయింది.

పరమానందం ఎంత ప్రయత్నించినా నేను కదలనంటూ మొండికేసుక్కూర్చుంది.

ఏడుపొచ్చింది హనుమాయమ్మకి.

దారిపొడుగునా విఘ్నాలే. బయలుదేరే ముందు గణపతికి పూజైనా చేసాను కాదనుకుంది.

"అలా చూస్తూ నిలబడతావేం? నువ్వూ చెయ్యివేయి. బండి మెకానిక్ వద్దకు తోసుకుపోదాం." అన్నాడు పరమానందం.

"కార్బరేటరు క్లీన్ చెయ్యాలి. ఏయే పార్ట్స్ పోయాయో చూడాలి ఎలా లేదన్నా రెండ్రోజులు పడుతుంది, మీకు బండివ్వడానికి" అన్నాడు మెకానిక్.

"బండి బాగుచేసి ఉంచండి.. మేం మళ్ళీ వస్తాం" అన్నాడు పరమానందం.

"బండి వదిలేస్తే మనం వెళ్ళేదెలా?" బిత్తర చూపులు చూస్తూ సందేహం వ్యక్తంచేసింది హనుమాయమ్మ.

"బస్సులున్నాయి కదా" అన్నాడు పరమానందం.

ఊపిరి పీల్చుకుంది హనుమాయమ్మ.

భర్త ఇంటికి పోదామంటాడేమోనని ఇంత సేపు గుండెల్లో రాయి పడిపోయింది.

రెండు గంటలు పడిగాపులు పడి బస్సెక్కారు పరమానందం దంపతులు.

రైట్ చెప్పాడు కండక్టరు.

కిటికీలోంచి రివ్వున వీస్తున్న గాలికి హనుమాయమ్మ ముంగురులు నుదుట మీద వయ్యారంగా నర్తిస్తున్నాయి. రాత్రి తొమ్మిదిన్నర ప్రాంతంలో ఏదో ఊళ్ళో బస్సు ఆగితే హోటల్లో సుష్టుగా భోంచేసి తాంబూలాలు సేవించారు పరమానందం దంపతులు.

మళ్ళీ కదిలింది బస్సు. నున్నటి తారురోడ్డు మీద రయ్‌మని దూసుకుపోతోంది సూపర్ డీలక్స్. ప్రయాణీకులు కునుకుపాట్లు పడుతున్నారు. ఉన్నట్లుండి కీచమన్న శబ్దం బస్సు ఆగింది.

పరమానందం దంపతులు నిద్రమత్తు నుండి బయట పడ్డారు. ముసుగులు ధరించిన నలుగురు వ్యక్తులు సుడిగాలిగా లోపలకు ప్రవేశించి, తుపాకులు చూపి ప్రయాణీకుల్ని భయభ్రాంతుల్ని చేసి వారి నుండి డబ్బు, నగలు, చేతి గడియారాలు దోచుకుని పోయారు. ప్రతిఘటించిన కండక్టర్ని, డ్రైవర్నీ గాయపరిచారు.

కట్టుబట్టలతో మిగిలారు పరమానందం దంపతులు.

"తెల్లవారుతున్నట్లుంది. కొద్ది సేపట్లో పోలీసులు వస్తారు. విచారణ పేరుతో మనల్ని వేధించుకు తింటారు. కోర్టుకు హాజరవమంటారు. పోయినవి ఎలానూ పోయాయి. మెల్లగా ఇక్కడ నుండి జారుకోవడం ఉత్తమం" అన్నాడు. పరమానందం.

సరేనంది హనుమాయమ్మ.

కాళ్ళీడ్చుకుంటూ ఏదో ఊళ్ళోకొచ్చి పడ్డారా వృద్ధ దంపతులు. నిద్రలేమికి వాళ్ళ కళ్లు మండుతున్నాయి. తిరుగు ప్రయాణానికి చార్జీలు లేవు. ఇంటికెలా వెళ్ళాలో వారికేమీ తోచడం లేదు. ఆకలవుతూ వుంటే ఆత్మారాముడి అల్లరి భరించలేక ఓ రెస్టారెంట్లోకడుగు పెట్టారు.

సగౌరవంగా లోనికి ఆహ్వానించాడు హోటల్ యాజమాని.

"ఊరు కాని ఊర్లో చిక్కుబడిపోయాం దొంగలు మా సర్వస్వం దోచుకున్నారు. ఇది యదార్థం. కట్టుకథ ఎంత మాత్రం కాదు. దయచేసి మాకిక్కడ ఏదైనా పని ఇప్పించండి మీ మేలు ఎన్నటికీ మరువలేము. చార్జీలకు అవసరమైన డబ్బు కూడగానే మా ఊరు వెళ్ళిపోతాం" దైన్యంగా పలికాడు పరమానందం.

వారి దుస్థితికి హోటల్ యజమాని మనసు కరిగినట్లుంది. "మీరేం పని చేయగలరు...?" అడిగాడు వారికేదో విధంగా సహాయ పడదామని.

"నా భార్య వంటపని చేస్తుంది. నేను వడ్డన చేయగలను."

పరమానందం మాటలకు సరేనన్నాడు హోటల్ యాజమాని. వెంటనే సర్వర్ని పిలిచి వాళ్ళకు కావలసిన పలహారాలను పెట్టమని ఆదేశించాడు.

"హాయిగా ఇంటి పట్టున ఉండి విశ్రాంతి తీసుకోవడం మానేసి 'హనీమూన్' అంటూ కష్టాలు కొని తెచ్చుకున్నావ్" అన్నాడు పరమానందం అపసోపాలు పడుతూ పొయ్యి మీంచి ఇడ్లీ వాయలు తీస్తున్న భార్యవంక జాలిగా చూస్తూ.

"మన హనీమూన్ ఇలా తగలడుతుందని నేనేమైనా కలగన్నానా? వెళ్ళండి. వచ్చిన

వాళ్ళకు వద్దన చేయండి.” కర్తవ్యాన్ని గుర్తు చేసింది హనుమాయమ్మ.

నెల రోజులయింది. హోటల్ యజమాని జీతం ఇచ్చాడు. తిరుగు ప్రయాణమయ్యారు పరమానందం దంపతులు.

ఊరి పొలిమేరలకు చేరుకోగానే వాళ్ళకు మోటారు సైకిలు గుర్తుకొచ్చింది. వెంటనే మెకానిక్ వద్దకెళ్ళి హీరోహోండా విడిపించుకుని ఇంటి ముఖం పట్టారు.

అంతలో పోలీసులు యమభటుల్లా తమవైపే రావడం గమనించింది హనుమాయమ్మ. ఆమె గుండెల్లో రాకెట్లు పరుగెత్తడం మొదలు పెట్టాయి.

“ఏవండీ..... పోలీసులు....లైసెన్సు” నీళ్ళు నమిలింది హనుమాయమ్మ.

పరమానందం భార్యకి జవాబు చెప్పేలోపలే పోలీసులు రంగ ప్రవేశం చేసారు.

ఈ నెంబరు గల బండి పోయినట్లు మాకు రిపోర్టు వచ్చింది. మోటారు సైకిలు కాజేసినందుకు మిమ్మల్ని ఎరస్టు చేస్తున్నాం”.

ఇన్‌స్పెక్టర్ మాటలకు మతి పోయింది పరమానందానికి.

“క్షమించండి. ఇదిది నా మిత్రుడి బండి. అతడే స్వయంగా తీసుకెళ్ళమని నాకిచ్చాడు” సంజాయిషి చెప్పుకున్నాడు. పరమానందం.

పోలీసులు అతడి మాటలనే మాత్రం ఖాతరు చేయలేదు.

“పద పోలీస్ స్టేషన్ ముచ్చట కూడా తీర్చుకుందాం” భార్యను ముందుకు నెట్టాడు పరమానందం.

కటకటాలు లెక్కపెడుతూ సెల్‌లో కూర్చున్న పరమానందం దంపతుల వద్ద కొచ్చాడు పోలీసు వర్తమానాన్ని అందుకున్న మన్మదరావు.

“నన్ను క్షమించు పరమానందం వారం రోజుల్లో వస్తానన్న నువ్వు నెల రోజులైనా కనిపించకపోయే సరికి మీకేదైనా యాక్సిడెంటయిందేమోనని బెంగపడ్డాను. పోలీస్ రిపోర్టివ్వమని పోరు పెట్టింది మా ఆవిడ. ఆ విధంగానైనా మీ ఆచూకి తెలుస్తుందేమోనని ఆశపడ్డాను. మీకేం భయం లేదు. నేనిచ్చిన రిపోర్టు వెనక్కు తీసుకోవడంతో మిమ్మల్ని విడుదల చేసారు. హాయిగా బండి మీద ఇంటికి వెళ్ళండి. నేను సిటీలో వస్తాను.

“చాలు మన్మధరావ్ ఇంతవరకు అయిన అనుభవం చాలు. మతి లేని నా భార్య మాటవిని గతిలేక నిన్ను బండి అడిగాను. ఇక నీ బండి నాకొద్దు. ఇన్నాళ్లూ అది మెకానిక్ దగ్గరే వుంది. ఈ రోజే రెండొందలిచ్చి విడిపించాను” అన్నాడు పరమానందం.

మరి మట్లాడలేదు మన్మధరావు.

హనీమూన్ ముగిసిన వైనాన్ని బస్సులో మననం చేసుకుంటూ ఇల్లు చేరుకున్నారు పరమానందం దంపతులు. ఆ రోజు లగాయితు మరి హనీమూన్ ప్రసక్తి ఎత్తలేదు హనుమాయమ్మ.

**(14 ఏప్రిల్ 1996, ఆంధ్రప్రభ డైలీ, ఆదివారం అనుబంధం)**